# స్వాతి, విజయ్

## యంగ్ అచీవర్ ఆఫ్ ద ఇయర్ - సోషల్ సర్వీస్

గోడలపై రాతలంటే మనం తక్కువగా చూస్తాం. కానీ... వాళ్లు గీసే గీతలు, రాసే రాతలు, వేసే బొమ్మలు చూస్తే మాత్రం క్షణం ఆగి ఆలోచిస్తాం.

ఆ కళాకారులు ఎంచుకున్న దారి అంత గొప్పది మరి. ఖమ్మం జిల్లాకు చెందిన స్వాతి, హైదరాబాద్ వాసి విజయ్.

ఇద్దరూ హైదరాబాద్ జెఎన్‌టియులో ఫైన్‌ఆర్ట్స్ చదువుకున్నారు. అక్కడే ఒకరికొకరు పరిచయమయ్యారు. కళతో పాటు జీవితాన్నీ పంచుకున్నారు. నచ్చిన బొమ్మలు వేసి ఏడాదికో గ్యాలరీ పెట్టుకోవడం ఈ జంటకు సంతృప్తినివ్వలేదు.

కొత్తగా ఏదైనా చెయ్యాలనుకున్నారు. సమాజానికి ఆర్ట్ ద్వారా ఏదైనా సందేశాన్ని చేరవేయాలనుకున్నారు.

రోడ్లపైన, గోడలపైన కొటేషన్లు, పెయింటింగ్స్ తో అలాంటి ప్రయత్నమే చేశారు. ఆ కళ పేరు గ్రాఫిటి.

తమ ప్రతిభతో ఫ్రెంచ్ ఎంబసీ స్కాలర్‌షిప్ గెలుచుకున్న ఈ జంట, పారిస్‌లో తొమ్మిదినెలలు కళావిహారం చేశారు.

స్ట్రీట్ ఆర్ట్‌కి అక్కడ ఉన్న ఆదరణ వారిని అబ్బురపరచింది. తాము ఎంచుకున్న పనిని మరింత వేగంగా ఎలా చేయాలో తెలుసుకున్నారు.

జనసంచారం ఉండేచోట ఖాళీగా ఒక గోడ కనిపిస్తే... తెల్లారేసరికి అదొక సందేశంగా మారిపోవచ్చు. ప్రశ్నగా నిలదీయొచ్చు. బాధ్యతను గుర్తుచేయొచ్చు.

రాత్రి ఎనిమిది గంటలనుంచి తెల్లారి నాలుగు గంటల్లోగా అనుకున్న పని పూర్తి చేస్తారు. ఈ కళాకారులకు ఇది హాబీ కాదు, సొంత ఖర్చులతో చేసే ఉద్యోగం. ఇదే జీవితం. రైతుల

ఆత్మహత్యలపై స్పందిస్తూ ఐదెకరాల పొలంలో సేవ్ ఫార్మర్ నినాదం సృష్టించి ప్రపంచాన్నే ఆలోచింపజేశారు. 2000 ప్రభుత్వం పాఠశాలలు మూసేస్తున్నారనే వార్త చదివి చలించిపోయిన ఈ జంట, సర్కారు బడికి కొత్త రూపు ఇచ్చి డ్రాపవుట్స్ ని తగ్గించే బాధ్యతనూ తలకెత్తుకున్నారు. 2014లో జపాన్ లో జరిగిన అంతర్జాతీయ చిత్ర ప్రదర్శనకు తెలంగాణ రాష్ట్రంనుంచి హాజరయ్యారు ఈ గ్రాఫిటీ కళాకారులు. రాత్రిపూట కుంచెను కదిలిస్తూ పగటికి కొత్త వెలుగును ప్రసాదిస్తూ... గొప్ప గొప్ప ఆలోచనలకు గోడ కడుతున్న స్వాతి విజయ్‌లను, సోషల్ సర్వీస్ విభాగంలో సాక్షి ఎక్సలెన్స్ అవార్డ్స్ 2017 యంగ్ అచీవర్ ఆఫ్ ద ఇయర్‌గా సత్కరిస్తోంది సాక్షి.